


# నిరుద్యోగి నిట్టూర్పు ★

రచన:
జి. ఆర్. టాగూర్

చల్లనిసముద్రం, తెల్లనివెన్నెల, చక్కిలిగింతలుపెట్టే పిల్లవాయువులు. ఆ సముద్రపుటొడ్డు ఇసుకలో తను, నీలిరంగు గాబర్డీన్‌సూటులోంచి తెల్లషర్టు, కాళ్లకి 'ఎంబాసిడర్' షూ ప్రక్కన నవయౌవన కోమలాంగి, మధురదరస్మితనయనచకోరి, ఎటపెటరే అయిన తన ప్రేయసి, ఆమె ఒడిలో తను, తన కళ్ళల్లో ఆమెకళ్ళు, మబ్బుచాటుకిపోయే చందమామ, దగ్గరకు రాబోయే అలల అలజడి............

ఒరేయ్! లేరా! అప్పుడే ఏడు దాటింది. మొద్దునిద్రా నువ్వూను. పది గం॥ ఎంప్లాయిమెంటుఆఫీసుదగ్గరుండాలి. ఏడయినా లేవలేదు. దరిద్రగొట్టుముఖం! వీడి ముఖానికీ ఉద్యోగమొకటి! అయ్యో! లేరాలే!....

ఉలిక్కిపడ్డాను! అప్పుడే నాంది ప్రస్తావన అయిపోతున్నాయి నేటి నా కార్యక్రమానికి. ఛ! మంచికల పాడయిపోయింది. ఆ తరువాత ఏం జరిగుండేదో .... ఏం జరిగుండేదో ఏమిటి నా బొంద....ఆ తర్వాత హాయిగా ఒక డ్యూమెంట్. అబ్బ! ఆ చల్లని వెన్నెల్లో, ఆ ప్రియురాలి వెచ్చని కౌగిట్లో, ఆ గాబర్డిన్ సూటులో....ప్చ్! ఏం లాభం....కలలో కూడా అనుభవించటానికి వీలులేని బ్రతుకు....ఐనా కలవచ్చేది ఎలాగూ వచ్చిందికదా కాస్త ముందు రాకూడదూ? టైము చూసుకుని మా నాన్న లేపే సమయానికే రావాలి! రాత్రి ఏ పన్నెండింటికో వస్తే ఎంత బాగుండేది.

అయినా కలకని ఏం లాభం, నా జీవితానికే విలువలేనప్పుడు. పూర్వం ఎస్. ఎస్. యల్. సి. పాస్ అవుతే చాలుట పెద్ద పెద్ద ఉద్యోగాలు. ఈకాలంలో బి. ఏ. కి వాల్యూ లేకుండాపోయిందిగాని పూర్వం బి.ఏ. అంటే చాలు 'రండి, రండి, ఇలా కూచోండి అని ఓ సోఫాలో కూర్చోపెట్టి, తీర్థప్రసాదాలు సమర్పించి, తమరు ఈ కలక్టరుపోస్టు స్వీకరించండి' అనేవారట. మరి ఈ కాలంలోనో గుమాస్తాకి పెద్ద గజెటెడ్‌ఆఫీసరుకి చిన్న. వెన్నుకటికి, అంటే నా చిన్నతనంలో మా నాన్న తన తనయుడనైన నన్ను పిలిచి, దగ్గిర కూచుండబెట్టుకుని, లాలించి, ముద్దుగా, 'ఒరే! నువ్వు కలక్టరుఅవుతావా!' అని అడిగేరు. అప్పుడు నేను తడుముకోకుండా బిల్లు కలక్టరు అవుతాను అన్నాను. చివరకు అదీ లేదు. నాకు మిగిలినవి మానాన్న పెట్టే చీవాట్లే.

అయినా యిందులో నా తప్పేముంది చెప్పండి! సంవత్స రన్నరఅయి 'హిందూ' పేపరు దగ్గిరపెట్టుకుని వీలయిన చోట్లకల్లా ప్రేమలేఖ (అప్లికేషను) లు పంపుతూనే వున్నాను. నా ప్రేమలేఖచూచి ఎవడైనా తన హృదయంలో స్థానమిస్తాడేమో నని. కొంత మంది దాన్ని చూడనేలేదు. కొంతమంది చూసినా చూడనట్టు వూరుకున్నారు. కొంత మంది సాహసించలేక మాచేతుల్లోలేదు పైకి వ్రాసుకో అన్నారు. ఇహ మిగిలినవారు స్థానం లేదు పొమ్మని కసిరికొట్టారు. అయినా ఒకటిన్నర సంవత్సరమై విరహం అనుభవిస్తున్నా గదా! ఏ ఒక్కడైనా నా హృదయంలో స్థానముంది ఈ ఉద్యోగం చేసుకో అనరాదూ.... అబ్బే! ఇంతా కష్టపడి లేఖల్ని పంపుతే జవాబిచ్చేవాడు ఒక్క ముక్క తో 'అనర్హుడవని తెలుపుటకు చాలా విచారించుచున్నాను' అంటాడు. అంటే మరి మేం నీకు ఉద్యోగం యివ్వలేం సోదరా! ఇంకెక్కడైనా చూసుకో అని చెప్పటమన్నమాట.

పంపిన అప్లికేషన్ల గొడవ అలా అయితే వెళ్లిన ఇంటర్వ్యూలు అంతే! పంచపాండవులులా అయిదుగురు ఇంటర్వ్యూ చేశారు. పంచపాండవులు అయిదుగురూ కలిపి ద్రౌపదిని పెళ్లిచేసుకున్నారు గాని నా కొక్కడూ ఉద్యోగం యివ్వలేదు.

మొదటివాడు శ్రీ ధర్మరాజు.

నీపేరు నాయనా! అడిగాడు ధర్మజుడు. శాంతంగా చెప్పాను.

ఏం చదువుకున్నావ్? ప్రశ్నించాడు కుంతీ సుపుత్రుడు. జవాబిచ్చాను. ఇలా సాగింది ఇంటర్వ్యూ. సక్సెస్ అనుకున్నాను. వారం రోజులలో తెలియజరుస్తానన్నాడు. పది రోజు లయింది వెళ్ళాను. 'సారీ! నిన్నొక లీవు వేకెన్సీలో ఇంటర్వ్యూచేశాను. అతను సెలవు కేన్సిలుచేసుకుని జాయినయ్యాడు' అన్నాడు యమధర్మరాజు కొడుకు ధర్మరాజు.

రెండవవారు వాయుపుత్రులు.

నీ పేరేమిటన్నావ్? కుర్చీలోంచి తన భారీ శరీరాన్ని ఇటునుంచి అటు కదల్చి నాలుగు కళ్లలోంచి చూస్తు గర్జించాడు భీముడు.

ఏదీ అనలేదండీ అందామని భీముడ్నిచూసి భయపడి అతని అన్నగారైన ఆంజనేయ స్వామిని మననంచేసుకుని ధైర్యంగా 'ఫలానా అండీ' అన్నాను. క్వాలిఫికేషను ? ఉరిమిందేమో అని మేఘంవైపు చూడబోయి ఇంటి కప్పుకేసిచూసి అయినా మెరుపులేందే అని ఆలోచించి 'ఓ ప్రశ్న' అనుకుని జవాబిచ్చాను.

'సరే నే చెప్పింది వ్రాసి అక్కడపెట్టి వెళ్లు' అని కాగితం నావద్దకు విసిరేడా పవనపుత్రుడు. నే కలంతీసేలోగా ప్రారంభించి వాయువేగ మనోవేగాల్తో ఒక పేరా చదివి గబుక్కున ఊరుకుని 'నెక్స్ట్' అన్నాడు. వెంటనే లేచి అయినా నాకు డిక్టేషను ఏంటి అనుకుని తెల్లకాగితానికి నా ముఖానికి అవినాభావ సంబంధాన్ని పోల్చుకుని ఆ కాగితాన్ని (తెల్ల) ఆయనకిచ్చి బయటపడ్డాను.

ఇహ మూడవమూర్తి అర్జునస్వాములవారు నీకు క్లాసేదైనా వచ్చిందా ? ఉద్యోగంలో పూర్వానుభవం వుందా? నాపేరు తెలుసునా ? ప్రశ్నపరంపరలు వదిలాడు సవ్యసాచి. జవాబులు వ్యతిరేకంగా పోయాయి. నరే పోనీ తెలివిగా ఆలోచించి ఈ ప్రశ్నలకి జవాబు చెప్పు. నీ విప్పు డెన్ని మెట్లెక్కివచ్చావు ?

'ఆరు' అన్నాను ఇందాక ఏదో ఆలోచిస్తూ లెక్కబెట్టినమెట్లను జ్ఞప్తికితెచ్చుకుంటూ.

అబ్బే! లెక్కపెట్టి నిన్ను చెప్పమనలేదు. నాకు కావలసింది తెలివితేటలు, తెలివైన

జవాబు ఏమిటో తెలుసా! ఇప్పుడెన్నిమెట్లు దిగబోతున్నావో అన్నిమెట్లని, సరే ఇది చెప్పు. రవీంద్రనాథ్‌టాగూరు ఏ బ్లేడుతో గడ్డంగీసుకునేవారు. రెండో బాణాన్ని వదిలాడు కిరీటి.

'అతనికి గడ్డంవుంది కదండీ' అన్నాను సంశయిస్తూ. నిజమే! అందుకే తెలివి కావాలన్నాను. ఎలిజబెత్‌రాణీ ఏ బ్లేడుతో గీసుకుందో ఆ బ్లేడుతో అంటే ఎలావుందో ఆలోచించు అని సగర్వంగా నావేపు చూశాడు. సరే నువ్వెళ్ళు, నీకు తర్వాత తెలియబరుస్తాం అన్నా డా ఫల్గుణుడు.

నాల్గవ మహాశయుడు నకులుడు పాపం! చాల బద్ధకస్తుడు. ఒకకాలు కుర్చీమీద ఇంకో కాలు కుర్చీక్రిందపెట్టి గేదెమార్కు సిగరెట్ (చుట్ట)తో కూర్చుని శాంతంగా పేపరు చదువుతున్నాడు. నే వెళ్లగానే కూర్చోమన్నాడు. పేరు, ఊరు, పుట్టినతేది, ఎంతవరకు చదువుకున్నదీ వ్రాసి అక్కడపెట్టి వెళ్ళు, రెండవ వాణ్ణి పంపించు అన్నాడు పేపరు చూస్తూనే. మనసులో తిట్టుకుంటూ వ్రాస్తున్నాను. ఇంతలో కుర్చీలో కూర్చున్నవాడల్లా టేబిలు మీదకు వంగి "సినీతార సరళ చెప్పుచున్నది మీరు ఎప్పుడు తెల్లనైన, శుభ్రమైన 'లక్సు' టాయిలెట్ సోపునే వాడుడు! అబ్బాయి! ఈ సరళ నిజంగా లక్సుసబ్బునే వాడుతుందంటావా!" అన్నాడు.

'గాబోలండీ' అన్నాను నేను సమయానికి తారసిల్లిన సినీతార సరళిని, లక్సుసబ్బును నిందిస్తూ.

ఏమనుకున్నాడో ఏమో గేదెమార్కు సిగరెట్‌ని ఆరిపోయినదానిని వెలిగించి ఈప్రక్కనున్నదానిని ఆ ప్రక్కకు తిప్పి పత్రికాపఠనంలో లీనమైపోయాడు.

'నా సర్టిఫికేట్లు చూస్తారా సార్!' కాస్త ధైర్యంచేసి మనిషి కాస్త మంచివాడనుకుని అడిగాను.

'నీవు రాసేవన్నీ రైటేనని నాకు నమ్మకముందోయ్' అని ధోరణి మార్చకుండా అనేశాడాయన.

'అవికావు సార్! ఇతర క్వాలిఫికేషన్సు' అన్నా.

'..............................'

'ఇది చూడండి ఇంటర్‌కాలేజియేట్ డిబేటు ప్రైజు విన్నరుని' అన్నానొక సర్టిఫికేటు చూపుతూ.

ఆఫీసులో డిబేట్లెందుకోయి పని జరగాలి అన్నాడు మాద్రీకుమారుడు.

పోనీ ఇదిచూడండి నేను కాలేజీలలో చాలా నాటకాల్లో నటించానండి! చాలా ప్రైజులు వచ్చాయి.

'ఆహా! సంతోషం' ఫోజు మార్చకుండా అన్నాడు నకులుడు.

ఇవిగో ఇవి ఆటల్లో నాకిచ్చిన సర్టిఫికేట్లండి అన్ని ఆటలు ఆడగలనండి అన్నా నేను.



................................ ....

నేను ఎన్. సి. సి. రేంకు హోల్డర్నండి! పరీక్షకూడా పాసయాను,

'శాంతినివాసంలో రమణారెడ్డిలాగ ఆఫీసులో మార్చింగ్ చేస్తావేమిటి' తన విట్టుకి తనే వికలించి నవ్వుతూ కోరచూపుచూశాడు.

'అబ్బే! మీ నెత్తిమీద విలయతాండవం చేస్తాను' అని మనసులో గొణుక్కుంటూ వచ్చేశాను. వెనుకనించి వెకిలినవ్వు వినిపిస్తూనే వుంది.

ఇహ అయిదవవాడు సహదేవుడు, ముక్కు క్రింద రెండు గండుతుమ్మెదలు వ్రాలాయా అన్నట్టుగావున్న ఫ్రెంచికట్ మీసం, విశ్వ ప్రయత్నానికికూడా వంగనిజుత్తు 'మలబార్ గురూజీ'లా వున్నాడు. పరిచయం అయాక అడిగిన మొదటి ప్రశ్న యిది.

'తుమ్ము వేగం గంటకు ఎన్నిమైళ్ళు! అంటే ఎంత వేగంతో తుమ్ముతాము?'

'వందమైళ్ళవేగంతో'

'వెరీగుడ్'

సరే ఈ ప్రశ్నలకి జవాబు చెప్పు!

(1) షాజహానుకి మొత్తం ఎంత మంది భార్యలు.

(2) నెహ్రూకి స్వాతంత్ర్య ఉద్యమంలో ఎన్నిసార్లు లాటీఛార్జి జరిగినది.

(3) అయూబ్‌ఖాను భార్యపేరేమిటి ?

ఏం తెలియదూ! అన్నాడు ఆశ్చర్యపోతూ!

బయటకు వచ్చాక తెలిసింది. ఆ పోస్టుకి ఒక రికమెండెడ్ కాండిడేటు వున్నాడని. ఎవరని అడిగెను. సహదేవుని స్నేహితుని ఇంటి యజమాని కొడుకని చెపుతూ అభ్యర్థులలో ఒకర్ని చూపెట్టాడు.

'ఏంరా! ఇంకా లేవలేదూ!' నాన్నకేక వినిపించింది. గబుక్కున మంచందిగి పరిగెత్తాను నాన్నకు కనిపించకుండా, 10 గంటలకు కాబోయే ఇంటర్వ్యూకి సిద్ధమవటానికి, లాభంలేదని తెలిసికూడా.

(అంతా కల్పితం)

★